క్లుప్తంగా

సంక్రాంతి అందరికి సుఖ సంతోషాలు తీసుకురావాలి

బాపట్ల: సంక్రాంతి పండగ అందరి జీవితాల్లో వెలుగు నింపాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ ఏడాది ప్రజలు పాడిపంటలతో తులతూగాలని కోరుకున్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన వరికూటి

వేమూరు: వేమూరు నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబం సంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి పండగ జరుపుకోవాలని ఆయన తెలిపారు. ఏడాది ఒక్కసారి వచ్చే పండగ సంక్రాంతి పండగన్నారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో పండగ జరుపుకోవాలని ఆయన కోరారు.

నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

రేపల్లె రూరల్: కష్టాలను కాల్చివేసే భోగి మంటలు.. భోగాలను అందించే భోగి పళ్లు.. కొత్త అల్లుళ్లకు స్వాగతం పలికే తోరణాలు.. ఇంటికి చేరే ధాన్యపు రాసులు.. తెలుగు లోగిళ్ల వద్ద రంగు రంగుల అందమైన రంగవల్లులు.. హరిదాసుల కీర్తనలు.. పిండి వంటలు.. కొత్త బట్టలు.. సంబరాలతో ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండగను జరుపుకోవాలని నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ సోమవారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాడి పంటలతో తులతూగాలని ఆయన కోరుకున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

ఎస్‌ఐ భార్గవ్

నగరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బండ్ల భార్గవ్ హెచ్చరించారు. మండలంలోని ఘాలివారిపాలెంలో కోడి పందేల స్థావరాలపై సోమవారం నగరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జూదం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాలలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



నగరం: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గోదాదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గోదాదేవి కల్యాణాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కమనీయమైన కళ్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తొలుత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఘనంగా శివముక్కోటి



భట్టిప్రోలు (కొల్లూరు): శివముక్కోటి వేడుకలు మండలంలో సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు శైవక్షేత్రాలు తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. శివముక్కోటి వేడుకల సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దైవ దర్శనం చేసుకున్నారు. భట్టిప్రోలు విశలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకారంలో ఉన్న దేవతామూర్తులను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పందెం కోడి గెలిచింది

- జోరుగా కోడి పందేలు
- పందెపు రాయుళ్లతో కిక్కిరిసిన బరులు
- రూ.కోట్లలో చేతులు మారిన నగదు



కొల్లూరు సమీపంలోని కోడి పందేల బరిలో పందేనికి ఉసిగొల్పుతున్న కోడి పుంజులు

కొల్లూరు: సంక్రాంతి పండగ సంప్రదాయం పేరుతో కోడి పందేల నిర్వహణ చేపట్టవద్దని పోలీసులు చేసిన హెచ్చరికలు మాటలకే పరిమితమయ్యాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని అధికార కూటమి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన కోడి పందేల బరులలో పందేలు యథేచ్ఛగా జరగడంతో ఎట్టకేలకూ పందెం కోడి పంతం నెగ్గించుకొని గెలిచినట్టయ్యింది. మండలంలో అధికార కూటమి పార్టీకి చెందిన నాయకులు కొల్లూరు శివారు బోసునగర్, అనంతవరం గ్రామాల వద్ద విస్తృత ఏర్పాట్లతో కోడి పందేలు, పేకాట, ఇతర జూద క్రీడల నిర్వహణకు బరులను సిద్ధం చేశారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు బరుల వద్ద హడావుడి సృష్టించి బరులను ధ్వంసం చేసి పందేలు నిర్వహించరాదని హెచ్చరికలు జారీ చేశారు. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల ముందు పోలీసుల హెచ్చరికలు తేలిపోవడంతో సోమవారం మండలంలోని రెండు బరులలో పెద్ద ఎత్తున కోడి పందేలు, జూద క్రీడలు జరిగాయి. కోడి పందేల బరులను పోలీసులు అడ్డుకుంటున్నారన్న సమాచారంతో పందేల నిర్వహణ ప్రాంతానికి పందెపు రాయుళ్లు చేరుకోరన్న ఉద్దేశంతో పందేల నిర్వహణ సాధారణంగా చేపడతామని నిర్వాహకులు ముందుగానే పందెపు రాయుళ్లకు తమ వేగుల ద్వారా సమాచారం చేరవేయడంతో సోమవారం ఉదయం నుంచి బరులు పందెపు రాయుళ్లతో కిక్కిరిసాయి. పెద్ద బరులు, చిన్న బరులు అని రెండు కేటగిరీలుగా విభజించి ఏర్పాటు చేసిన బరులలో రూ.20 వేలకు పైబడిన పందేలు ఒక చోట, రూ.20 వేలకు తక్కువ పందేలు మరోచోట నిర్వహించారు. భారీ సంఖ్యలో కోళ్లతో తరలివచ్చిన పందెపు రాయుళ్లు వేసిన పందేలతో ఇరు ప్రాంతాలలో బరుల వద్ద రూ.కోట్లు చేతులు మారాయి. కోడి పందేలకు తోడు పేకాట, గుండాట, బిళ్లల ఆట, పెద్దబజారు-చిన్నబజారు వంటి ఆటల రూపంలో భారీ స్థాయిలో నగదు చేతులు మారినట్లు అంచనాలు వేస్తున్నారు.



జంపని గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

సంక్రాంతికి జోరుగా కోడి పందేలు

వేమూరు: సంక్రాంతి సంబరాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. సోమవారం నుంచి బరుల్లో కోడి పందేలు, మద్యం, పేకాట జోరుగా సాగుతున్నాయి. వేమూరు మండలంలోని జంపని షుగర్ ఫ్యాక్టరీ మాగాణి భూముల్లో సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేశారు. బరిలో వేల సంఖ్యలో కోడి పందేలు సాగుతున్నాయి. మంగళవారం సంక్రాంతి పండగ రోజు లక్షల రూపాయల్లో కోడి పందేలు జరిగే అవకాశం ఉందని నిర్వాహకులు చెపుతున్నారు.



కొల్లూరు శివారు బోసునగర్ కోడి పందేల బరిలో పోరాడుతున్న పందెపు కోళ్లు



కొల్లూరు శివారు బోసునగర్ వద్ద కోడి పందేల బరి చుట్టూ మూగిన పందెపు రాయుళ్లు



కొల్లూరు శివారు బోసునగర్ వద్ద కోడి పందేల బరిలో కిక్కిరిసి ఉన్న పందెపు రాయుళ్లు

పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపి మోసగించిందని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ విమర్శించారు. విద్యుత్ భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు, సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను సోమవారం భోగి మంటలలో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ భారాలను తగ్గించాలని డిమాండ్ చేసిన టీడీపీ నేడు అధికారం చేపట్టగానే విద్యుత్ చార్జీలను తారస్థాయిలో పెంచటం విచారకరమన్నారు. సర్దుబాటు చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని, అసలు కంటే కొసరు అధికంగా ప్రజలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకునే ధైర్యం లేక మోదీకి లొంగిపోయి అదానీ చెప్పు చేతల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు.



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రజలపై విద్యుత్ చార్జీల పేరుతో రూ.15 వేల కోట్ల భారం మోపుతున్నదని, మరో పక్కన స్మార్ట్ మీటర్లు పెడుతూ ప్రీ పెయిడ్ విద్యుత్ పేరుతో ప్రజల దగ్గర మరింత ఎక్కువగా విద్యుత్ చార్జీలు వసూలు చేయటం కోసం కూటమి ప్రభుత్వం పూనుకుందని తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఆపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కే ఆశీర్వాదం, కే రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యానికి సంప్రదాయక పోటీలు దోహదం

ఎస్‌ఐ జి.ఏడుకొండలు

కొల్లూరు: సంప్రదాయక క్రీడలు, ముగ్గుల పోటీలు వంటి వాటి ద్వారా ఐకమత్యం సాధ్యపడుతుందని కొల్లూరు ఎస్‌ఐ జి.ఏడుకొండలు అన్నారు. సోమవారం మండలంలోని తోకలవారిపాలెంలో ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ-ఐద్వా, ప్రజా నాట్య మండలి సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులు, యువకులు, మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో ప్రజలందరూ కలసికట్టుగా కోడి పందేలు వంటి జూద క్రీడలకు ఆస్కారం ఇవ్వకుండా సంప్రదాయక క్రీడలు, ముగ్గుల పోటీలతో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచి టి.కృష్ణ మోహన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య, ప్రజా సంఘాల నాయకులు బి.సుబ్బారావు, పి.మనోజ్, వాగోలు ఏసు, వాగోలు రమేష్, భాగ్యరాజు, కోటేశ్వరరావు, వి.చిన్నసుబ్బారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలలో మహిళలు

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కుచ్చెళ్లపాడు(వేమూరు): సామాజిక, ఆర్థిక చైతన్యం కలిగిన జీవితాలలో అభివృద్ధి సాధించాలంటే డాక్టర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్ర యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బొరుగడ్డ సుబ్బయ్య అన్నారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో భీమా కోరేగావ్ విజయోత్సవ సంబరాలు సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసిమళ్ల వెంకటరత్నం మాట్లాడుతూ 1818 జనవరి 1వ తేదీన 500 మంది మహర్ సైనికులు 28 వేల మంది పీష్వా సైన్యాన్ని 24 గంటల్లో నిద్రాహారాలు లేకుండా ఆత్మగౌరవం కోసం వీరోచితంగా పోరాడి విజయం సాధించారన్నారు. అందువల్ల ప్రతి ఏడాది జనవరి 13న కోరేగావ్ విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజు, కొండెపూడి సునీల్, పెరికల సతీష్, వేమ రామరాజు, బొరుగడ్డ వీర స్వామి, పెరికల పృథ్వీచంద్, వెంకటేశ్వర్లు, ఎడ్ల రాజు, కొండేపూడి రవి, పెరికల ఆదిశేషు, బొరుగడ్డ పవన్, కళ్యాణ్, వాసిమళ్ల రతన్‌రాజు, నెమలికంటి గోపి, తలకాయల అశోక్, పెరికల లాజర్, పెరికల ధనుష్, పెరికల వినాయకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ



వేమూరు: సంక్రాంతి సంబరాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పుర వేదిక వద్ద సోమవారం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగను ప్రజలు సంప్రదాయంగా పండగ నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందని ఆయన తెలిపారు. సంక్రాంతి పండగ ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, జనసేన నాయకుడు ఊస రాజేష్, బండారు సూర్యనారాయణ, ఎంపీడీవో శివన్నారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా భోగి వేడుకలు

రేపల్లె రూరల్: నియోజకవర్గంలో భోగి పండగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు ఏర్పాటు చేయటంతో లక్ష్మీనారాయణుడి కృపకు పాత్రులై భోగములు అనుభవిస్తారన్న నమ్మకంతో ఎక్కువ మంది భోగి మంటలు వేస్తుంటారు. వేకువజామునే యువకులు, పెద్దలు పురవీధుల్లో భోగి మంటలను వేసుకొని సందడి చేశారు. ఉదయం 3.30 గంటల నుంచి 7 గంటల వరకు పురవీధుల్లో ఏర్పాటు చేసిన భోగి మంటల వద్ద చిన్నా, పెద్ద అందరూ చలి కాచుకుంటూ కేరింతలు కొట్టారు. చలిమంటలు అనంతరం పుణ్య స్నానాలు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నగరంలో...

నగరం: భోగాలనిచ్చే భోగి పండగ వేడుకలను సోమవారం మండలంలోని ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండగకు మొదటిరోజైన భోగి దక్షిణాయనానికి, ధనుర్మాసానికి చివరి రోజు కావడంతో ఇళ్ల లోగిళ్లలో రంగు, రంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలను పెట్టారు. వేకువజామునే భోగి మంటలు వేసి ఆ మంటల చుట్టూ నృత్యాలు చేశారు. మండలంలోని పలు దేవాలయాల్లో భోగి పండగ వేడుకలను అంగ రంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భోగి మంటలు వేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొల్లూరులో...

కొల్లూరు: సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి పండగ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున పలు గ్రామాలలో ప్రజలు ప్రధాన కూడళ్లు, తమ గృహాల వద్ద భోగి మంటలు వేసి పండగ వేడుకలను ఆరంభించారు. గృహాలలోని పాత సామగ్రిని భోగి మంటలలో వేసి, ఏడాది మొత్తం సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలగాలని వేడుకున్నారు. అనంతరం ఆలయాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొని దైవదర్శనాలు చేసుకున్నారు. సాయంత్రం చిన్నారులకు భోగి పళ్లు పోసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



పద్మశాలీయ వీధిలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు

ఘనంగా చిన్నారులకు భోగి పళ్ల ఆశీర్వచనం

భట్టిప్రోలు (కొల్లూరు): భోగి పండగ పురస్కరించుకొని చిన్నారులకు సామూహిక భోగి పళ్ల ఆశీర్వచన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం మండలంలోని ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో దీవి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆయురారోగ్యం, భోగ భాగ్యాలతో వర్ధిల్లాలని పెద్దలు ఆశీర్వాచనాలు అందజేశారు. తొలుత గ్రామంలో నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టరు. భోగి పండగ వేడుకలలో భాగంగా గోదా రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం అందె మధు దంపతులతో ప్రధాన అర్చకులు దీవి రఘునాథ్ చక్రవర్తి వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొసనం భాస్కర వెంకటరమణ, పణితపు నాగేశ్వర రావు, వామనపల్లి కోటేశ్వరరావు, జంజనం హేమశంకర రావు, జి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: సంక్రాంతి సంబరాలలో భాగంగా సోమవారం భోగి పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. కర్లపాలెం సెంటర్‌లో తెల్లవారుజామున భోగి మంటలు వేసి తమ ఇళ్లలోని పాత వస్తువులను భోగి మంటలలో వేశారు. సాయంకాలం చిన్నారులకు భోగి పళ్లు పోసి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు గాలి పటాలను ఎగురవేసి సందడి చేశారు.



పెదపోస్టాఫీసు సమీపంలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు



పెసర్లంక రామన్నపేట వద్ద భోగి మంటలు వేస్తున్న స్థానికులు

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు): సంక్రాంతి పండగ సంబరాలు గ్రామాలలో ఘనంగా ఆరంభమయ్యాయి. సోమవారం భోగి పండగను పునస్కరించుకొని తెల్లవారుజామునే భోగి మంటలు వేసి ప్రజలు పండగ వేడుకలకు స్వాగతం పలికారు. గ్రామాలలోని వీధులు, కూడళ్లలో పిల్లలు, పెద్దలు కలసి సంతోషకరమైన వాతావరణంలో భోగి మంటలు వేసి సందడి చేశారు. ఏడాది పొడవునా భోగభాగ్యాలు కలుగజేయాలని కోరుకుంటూ భోగి వేడుకలు జరుపుకున్నారు.



ఐలవరంలో చిన్నారులకు సామూహిక భోగి పళ్లు



కర్లపాలెంలో భోగి మంటలు వేసిన ప్రజలు



భట్టిప్రోలులో భోగి మంటలు వేస్తున్న చిన్నారులు

భోగి మంటలతో సంక్రాంతి వేడుకలు ప్రారంభం

బాపట్ల: భావన్నారాయణస్వామి దేవాలయం వద్ద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు భోగి మంటలతో సంక్రాంతి వేడకలను ప్రారంభించారు. ఎంతో చరిత్ర కలిగిన భావన్నారాయణస్వామి దేవాలయం వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించుకోవటం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ఏడాది అందరికి సంక్రాంతి వెలుగులు నిండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ సైనికుల కార్యాలయంలో వద్ద తాండ్రా సాంబశివరావు ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. దేశ రక్షణలోఉన్న తమ పిల్లలను మాజీ సైనికుల్లో చూసుకుంటూ ఎంతో మంది భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్నారు.



భావన్నారాయణస్వామి దేవాలయం వద్ద భోగి మంటల కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

రేపల్లె రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని మోర్లవారిపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో మోర్లవారిపాలెంలో దాడులు నిర్వహించగా గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడ్డారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.1200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ముగ్గురు కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

నిజాంపట్నం: ముగ్గురు కోడి పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని కేసనవారిపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. అడవులదీవి ఎస్‌ఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో దిండి పంచాయతీ కేసనవారిపాలెం గ్రామంలో దాడులు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి ఒక కోడి పుంజు, రూ.590 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

గోదాకృష్ణుల కల్యాణం



జంపని(వేమూరు): ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా సోమవారం జంపని చెన్న కేశవాలయంలో గోదా కృష్ణుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మన్నె వెంకట సుబ్బారావు, లక్ష్మి దంపతులు ఉత్సవ కర్తలుగా వ్యవహరించారు. పండిత దీవి లక్ష్మి నరసింహాచార్యులు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం గోదా కృష్ణుల కల్యాణం జరిపించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి ధనుర్మాస వ్రత ఫలాన్ని వివరిస్తూ కల్యాణ వ్యాఖ్యానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్ట్

చందోలు(కర్లపాలెం): కోడి పందేలు ఆడటం, ప్రోత్సహించటం చట్ట ప్రకారం నేరమని చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ చెప్పారు. కోడి పందేలు వేస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. మంతెనవారిపాలెంలో కోడి పందేలు వేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.2,500, కొత్తపాలెంలో ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఒక పుంజు, రూ.1500 నగదు, పిట్టలవానిపాలెంలో ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు పుంజులు, రూ.950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.